www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231

చాళుక్య ద్వారము

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వుల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 28 | 26-04-2021 | పుటలు : 4





**ఏప్రిల్ 21**
**శ్రీరామ నవమి శుభాకాంక్షలు!!**
-నన్నయ వాణి

## నన్నయ అభివృద్ధికి పాటుపడదాం

**వ్యవస్థాపక దినోత్సవ వేడుకలో వీసీ మొక్కా జగన్నాథరావు**



**22.04.21 (మీడియాసెల్)** ధరిత్రి పరిరక్షణకు మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సమష్టిగా పాటుపడదామని, మన భూమిని మన విశ్వవిద్యాలయాన్ని మనమే కాపాడుకుందామని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. గురువారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవ వేడుకను మరియు ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ కన్వెన్షన్ సెంటర్ లో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ హాజరై నన్నయ విగ్రహానికి, విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు స్వర్గీయ డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి, స్వర్గీయ జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటాలకు పూలమాలికలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దివంగతనేత డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి, మాజీమంత్రివర్యులు జక్కంపూడి రామ్మోహనరావు మరియు గోదావరి విశ్వవిద్యాలయ సాధన సమితి కృషి ఫలితంగా ఏర్పడిన నన్నయ విశ్వవిద్యాలయం ఉభయగోదావరి జిల్లాలకు ఉన్నత విద్యా కేంద్రంగా విలసిల్లుతుందని అన్నారు. ఆదికవి నన్నయ పేరుతో 2006వ సంవత్సరంలో ప్రారంభమైన విశ్వవిద్యాలయం తక్కువ కాలంలోనే ఎక్కువ అనుబంధ కళాశాలతో రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయంగా గుర్తింపును సాధించిందని తెలిపారు. 12బి గుర్తింపు, ఐ.ఎస్.ఓ గుర్తింపులను సాధించి నాక్ గుర్తింపు సాధనగా ముందుకు సాగుతుందని అన్నారు. ఆయా ప్రాంతాల నుండి విశ్వవిద్యాలయ కుటుంబంలో భాగస్వామ్యమైన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అంతా తమ కర్తవ్యాన్ని తాము త్రికరణశుద్ధిగా నెరవేర్చడమే మహనీయులు రాజశేఖరరెడ్డి, రామ్మోహనరావులకు ఇచ్చే ఘన నివాళి అని తెలియజేసారు. మహనీయుల కృషి ఫలితంగా వచ్చిన విశ్వవిద్యాలయం మనందరిని ఒక కుటుంబంగా చేసిందని, సమాజంలో గౌరవాన్ని, హోదాను కల్పించిందని అటువంటి వర్సిటీకి తిరిగి మనం ఏమి ఇస్తున్నామనే ఆత్మవిమర్శను అందరూ చేసుకోవాలన్నారు. దాతల సహకారంతో విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని చెప్పారు. తల్లివంటి ధరిత్రిని, తల్లివంటి విశ్వవిద్యాలయాన్ని పరిరక్షించుకుంటూ అభివృద్ధిలోనికి తీసుకువెళ్ళాలని పేర్కొన్నారు. జీయాలజీ ఆచార్యులుగా కోట్ల సంవత్సరాలుగా భూమి ఆవిర్భావ దశలను వివరిస్తూ, కొన్ని కోట్ల జీవరాశుల తరువాత వచ్చిన మానవుడు ధరిత్రి కాలుష్యానికి కారణమవుతున్నాడని వివరించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దుదామని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.పి.ఉమామహేశ్వరి, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, అధ్యాపకులు డా.ఎం.గోపాలకృష్ణ, డా.మణిరమణ, గౌతమ్ నాయుడు తమ అభిప్రాయాలను, వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు.

**మనవి**

'కరోనాపై అవగాహన' అంశంపై రచనలను ఆహ్వానించిన సందర్భంలో విశేషమైన స్పందన లభించింది. తరువాత సంచికలలో వరుసగా ప్రచురించేస్తాం. అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.
– నన్నయ వాణి

## విద్యార్థులకు అంబేద్కర్ మార్గదర్శకం





**అంబేద్కర్ వారోత్సవాల సందర్భంగా నన్నయవాణి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ**

**14.04.21 (మీడియాసెల్)** ప్రపంచ మేధావి, భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విద్యార్థులు అంబేద్కర్ ను మార్గదర్శకంగా తీసుకోవాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. బుధవారం బి.ఆర్. అంబేద్కర్ 130 వ జయంతి వేడుకలను విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు అంబేద్కర్ పాటలు, ఉపన్యాసాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ విశ్వజ్ఞానిగా గుర్తింపు పొందిన అంబేద్కర్ ను విద్యార్థులు మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు వచ్చినా తాను నమ్మిన సిద్ధాంతాన్ని అంబేద్కర్ విడువలేదని చెప్పారు. విద్యలోనూ, ఉద్యోగంలోనూ, కార్యక్రమాలలోనూ వివక్షతను ఎదుర్కొన్నప్పటికీ వాటిని ధైర్యంగా తట్టుకొని నిలిచారని, సమానత్వ భావాన్ని సమాజానికి తెలియజేశారని అన్నారు. అన్ని రంగాల్లోనూ తనదైన గుర్తింపుతో ఉన్నత శిఖరాలకు చేరుకొని, తన విజ్ఞానాన్ని సమాజ హితం కోసం ఖర్చు చేసిన అంబేద్కర్ యువతకు ఆదర్శమని తెలిపారు. ఓ.ఎన్.జీ.సీ రిటైర్డ్ జనరల్ మేనేజర్ పాపారావు మాట్లాడుతూ బౌద్ధ ధర్మ సూత్రాలతో నాటి సమాజంలో ఉన్న మూఢత్వాన్ని అంబేద్కర్ తొలగించారన్నారు. రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ (పి.ఎఫ్) పి.పావన ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అంబేద్కర్ ఖ్యాతిని కొనియాడుతున్నాయని గుర్తు చేశారు. విజ్ఞానం, స్వాభిమానం, శీలం వంటి లక్షణాలతో అంబేద్కర్ మహోన్నత వ్యక్తిగా ఎదిగారని తెలిపారు. తరువాత ఉగాది మరియు అంబేద్కర్ వారోత్సవాల విశేషాలతో విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వారపత్రిక నన్నయవాణి ప్రచురించిన ప్రత్యేక సంచికను వీసీ ఆవిష్కరించారు. అలాగే అంబేద్కర్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డా.బి. జగన్మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ డా.వి.పెర్సిస్, డా.కె.రమణేశ్వరి, డా.విజయనిర్మల, డా.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

**మంచి మాట**



## సంపాదకీయం




### ఆదికావ్యం

సమస్త భారతీయ సాహిత్యంలో ఆదికావ్యం రామాయణం. వాల్మీకి మహర్షి ఆదికవి. రాముని యొక్క అయణం అంటే ప్రయాణమే రామాయణం. ర- అనగా ఆత్మ. మ- మనసు.ర- సూర్య బీజం. అజ్ఞానాన్ని పోగొడుతుంది. అ- చంద్రబీజం. తాపాన్ని పోగొడుతుంది. మ- అగ్ని బీజం. పాపాన్ని భస్మం చేస్తుంది. రా- అంటే పురుషుడు, మ- అంటే ప్రకృతి. పురుషుడు ప్రకృతి కలిస్తేనే సమస్తవిశ్వం ఏర్పడింది. ఈ విధంగా రామ శబ్దానికి నిత్య సత్యమైన పరబ్రహ్మమని అర్థం చెప్పుకోవచ్చు. విశ్వం అంటే పరబ్రహ్మ స్వరూపమే.

'రామో విగ్రహవాన్ ధర్మః' రాముడు మూర్తీభవించిన ధర్మ స్వరూపుడు.రాముని ధర్మనిరతిని, ప్రయాణాన్ని రామాయణంలో మనం అడుగడుగునా గమనించవచ్చు. రాముడు మానవునిగా పుట్టిన దేవుడు. ఆ మానవుడే దేవునిగా పూజలందుకున్న రాముడయ్యాడు. సకల శాస్త్రాలూ నేర్చుకున్నాడు. సౌర్య పరాక్రమాలలో సాటి రాగలవాడెవడూ లేడనిపించుకున్నాడు. తండ్రి మాట జవదాటలేదు. ఎప్పుడూ అబద్ధం ఆడలేదు. మాటకు కట్టుబడి ఉన్నాడు. శత్రువులను చీల్చి చెండాడాడు.శరణు అన్న వారికి అభయం ఇచ్చి ఆదుకున్నాడు. రాజు అనే అధికారాన్ని ఎన్నడూ ప్రదర్శించలేదు. శీల సంపదను కాపాడుకున్నాడు.తన మాటనే ప్రజలు వినటం కాకుండా,తానే ప్రజల మాట విన్నాడు. భార్యను ఎంత గొప్పగా ప్రేమించాలో, సోదరులతో ఎంత అనురాగంతో మెలగాలో, తల్లిదండ్రుల్ని ఎంత గౌరవించాలో అన్నింటినీ పాటించాడు. ఆయన పాలనలో ధర్మం నాలుగు పాదాలతో నడిచింది.అందుకనే రామరాజ్యం అనే పేరు నిలిచింది.

ఆయన గుణవంతుడు, వీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యభాషి, దృఢనిష్ఠ కలిగినవాడు, సదాచార యుతుడు, సర్వభూత హితుడు, విద్వాంసుడు, సమర్థుడు, ప్రియదర్శనుడు, మనోనిగ్రహం కలిగినవాడు,క్రోధం లేనివాడు, అసూయ లేనివాడు,రణ భయంకరుడు, కాంతి మంతుడు అనే 16 గుణాలు కలిగిన షోడశ కళాపూర్ణుడు, సకలగుణ సంపన్నుడు శ్రీరాముడు. ఇందులో ఏ కొన్ని సుగుణాలను అలవరచుకున్నా మనిషి గొప్పవాడవుతాడు. ఇంత సద్గుణ సంపద కలిగిన వాడు కాబట్టి ఆయనను సుగుణాభిరాముడన్నారు. ప్రజలు తమ గుండెల్లో గుడి కట్టారు.వాడవాడలా రాముని ప్రతిష్టించారు.

**రామాయణంలోని ప్రతి పుట ఒక నీతి గ్రంథం. రామనామం మధురాతి మధురం. 'నిధి సుఖమా.. రాముని సన్నిధి సుఖమా... 'అని ప్రశ్నించారు త్యాగరాజస్వామి.' శ్రీరామ నీ నామమెంతో రుచిరా....' అని కీర్తించారు రామదాసు. శ్రీరామ నవమి సందర్భంగా శ్రీమద్రామాయణానికి, వాల్మీకి మహర్షికి నన్నయవాణి భక్తి నీరాజనం!!**

## నన్నయ విద్యార్థులకు ఆన్లైన్ తరగతులు

**15.04.21 (మీడియాసెల్)** ఉభయగోదావరి జిల్లాల్లో కోవిడ్ విజృంభిస్తున్న నేపథ్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ లోని విద్యార్థులకు నేటి నుండి (16వ తేదీ) ఆన్లైన్ తరగతులు నిర్వహిస్తున్నామని రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ తెలిపారు. గురువారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ అశోక్ సర్క్యులర్ ను విడుదల చేసి వివరాలను తెలియజేశారు. తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోవిడ్ కేసులు విజృంభిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని విశ్వవిద్యాలయ ప్రాంగణాల విద్యార్థులకు ఆన్లైన్ తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. యూనివర్సిటీ హాస్టల్స్ విద్యార్థులు ఇండ్లకు వెళ్లి సురక్షితంగా ఆన్లైన్ తరగతుల్లో పాల్గొనాలన్నారు. సాధారణ పరిస్థితులు నెలకొనిన తర్వాత విశ్వవిద్యాలయ ప్రాంగణంలో తరగతులు జరుగుతాయని తెలియజేశారు. అప్పటివరకు విద్యార్థులు ఇంటివద్ద సురక్షితంగా ఉంటూ ఆన్లైన్ తరగతులను సద్వినియోగం చేసుకుంటూ విజ్ఞానంతో ముందుకు సాగాలని సూచించారు.

# సమాజహితమే సాహిత్యం : వీసీ



**20.04.21 (మీడియాసెల్)** సమాజహితానికి సాహిత్యం ఎంతో దోహదపడుతుందని, కష్టాలైన, కన్నీళ్లయినా, కరోనయైనా సాహిత్యం తనదైన శైలిలో ప్రజలను చైతన్యవంతులను చేస్తుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్లవనామ సంవత్సర ఉగాది జాతీయ కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయ తెలుగుశాఖ, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనానికి కన్వీనర్ గా డా.తరపట్ల సత్యనారాయణ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ సాహిత్యం ప్రజలను చైతన్యవంతులను చేస్తుందని కష్టనష్టాలలో, ఆపదలో, విపత్తులలో సాహిత్యం తోడుగా ఉంటుందని అన్నారు. కరోనా సమయంలో అవగాహన కల్పిస్తూ సాహిత్యం ప్రజలను చైతన్యవంతులను చేసిందని తెలిపారు. మానవుడు ఎంత అభివృద్ధి చెందుతున్నా, అంతకు మించిన సమస్యలను ఎదుర్కోవాలసి వస్తుందని చెప్పారు. ప్రకృతికి విరుద్ధంగా మానవుడు ఏమీ సాధించలేడన్నది అనేక సందర్భాలలో రుజువు అవుతుందని దానిని గ్రహించి ప్రకృతితో మమేకమవుతూ జీవనాన్ని సాగించాలని తెలిపారు. ప్రకృతితో సఖ్యతను పెంచే గొప్ప ఔషధం సాహిత్యమని, దానిని సమర్థవంతంగా భావి కవులు ఉపయోగించుకోవాలని తెలియజేశారు. సమాజ హితమే సాహిత్యమని అటువంటి సాహిత్యాభివృద్ధికి పాటుపడుతున్న కవులను అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ ఉగాది జాతీయ కవి సమ్మేళనానికి విచ్చేసిన కవులను నిర్వాహకులను అభినందించారు. అతిథులుగా విచ్చేసిన శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్, తూర్పుగోదావరి జిల్లా సెట్రాజ్ సి.ఇ.ఓ ఎం.భానుప్రకాష్ మాట్లాడుతూ నేటికాలంలో వస్తున్న సాహిత్యం, కవుల ధోరణి, కవితావస్తువు ఎంపిక తదితర అంశాలను ప్రస్తావించారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో అద్దంకి రాజా, చిద్దం సునీత, చిట్టే లలిత, ఐల్ల సంధ్య, ఆయా ప్రాంతాల నుండి విచ్చేసిన కవులు, కవయిత్రులు పాల్గొన్నారు.

## పుస్తక దాతలకు వీసీ కృతజ్ఞతలు

**23.04.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఆయా విభాగాలకు పుస్తకాలను బహూకరించిన దాతలకు వీసీ మొక్కా జగన్నాథరావు కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ పుస్తకాలు బహూకరించిన వారి వివరాలను తెలియజేశారు. కోడూరి శ్రీరామమూర్తి, డా.ప్రభాకర శర్మ, డా.దాసు అచ్యుతరావు, మైలవరపు రామ్మూర్తి, శీలా సుభద్రాదేవి శీలా వీర్రాజు, ఫణి నాగేశ్వరరావు ,పెరుమాళ్ళ రఘునాథ్, డా.డి.ఎస్.వి. సుబ్రహ్మణ్యం,ఆచార్య జోస్యుల సూర్యప్రకాశ రావు,డా.అరిపిరాల నారాయణరావు,ఆచార్య పొన్నా లీలావతి,నిడదవోలు వెంకట్రావు,భాట్టం శ్రీరామ్మూర్తి కుటుంబ సభ్యులు మొదలైన దాతలు విశ్వవిద్యాలయానికి పుస్తకాలను బహూకరించారని అన్నారు. ఎందరో విద్యార్థులకు ఈ అమూల్యమైన పుస్తకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో మంచి పుస్తకం కొనుక్కోమని కందుకూరి వీరేశలింగం గారి మాటను జ్ఞాపకం చేస్తూ పుస్తకాలను సేకరించిన అధ్యాపకులను అభినందించారు.



## సుంకర ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**14.04.21 (మీడియాసెల్)** సుంకర ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలో డాక్టర్ వినయ్ సుంకర హెల్త్ సెంటర్ వద్ద వినయ్ సుంకర జయంతి వేడుకలను నిర్వహించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై వినయ్ సుంకర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో హెల్త్ సెంటర్ ను ఏర్పాటుచేసిన వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉభయగోదావరి జిల్లాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. డాక్టర్ సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన కుమారుడు మరణించిన తర్వాత విశ్వవిద్యాలయంలో విద్యార్థులను తన పిల్లలుగా భావిస్తున్నానని అన్నారు. తన సోదరుల సహకారంతో తమకు కలిగిన దానిలో తన కుమారుడు జ్ఞాపకార్థం ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

ఏప్రిల్ 23

### ప్రపంచ పుస్తక దినోత్సవం



**పుస్తకాలు - కాల సాగర తీరాన దారిచూపే లైట్ హౌసులు!!**
**పుస్తకాలు - హస్తగత సుందరోద్యానవనాలు!**
**పుస్తకాలు - అనర్ఘ కోశాగారాలు!**
**పుస్తకాలు - ఆత్మకి ఔషధాలు!!**
**- నన్నయ వాణి.**




## భారత వీరుడా...

భారత
దేశం మంచుకొండల్లో,
రాళ్లతో స్నేహం చేసేవాడా.....
భారత మాత రక్షకుడవూ...
భావి భారత శిక్షకుడవూ...
నవభారత దివ్వెవు నీవూ...
దండం దండం ఓ సైనికా,
దండం దండం వీరుడా నీకూ...
దండం దండం దీరుడా నీకూ...
దండం దండం భారత వీరా...
భారత దేశం మంచుకొండల్లో,
రాళ్లతో స్నేహం చేసే వాడా....
మనషులనంత రక్షణ కోసం,

దేశం కోసం దేహం వదిలే,
సరిహద్దుల్లో అడ్డము నీవూ...
అమ్మకు నీవూ... రక్షకుడవూ...
దండం దండం ఓ సైనికా,
దండం దండం వీరుడా నీకూ...
దండం దండం దీరుడా నీకూ...
దండం దండం భారత వీరా...
భారత దేశం మంచు కొండల్లో,
రాళ్లతో స్నేహం చేసే వాడా....
అన్నం దొరుకక, ఆకలి తీరక,
నీళ్లనే.. నివూ అన్నమంటివి.
భారత మాత ముద్దు బిడ్డవూ...
అవతలి వాళ్లకు శత్రు
వయితివి...భారత మాతకు
పుత్రుడవయితివీ...
దండం దండం ఓ సైనికా,
దండం దండం వీరుడా నీకూ...
దండం దండం దీరుడా నీకూ...
దండం దండం భారత వీరా...

**- డా. పెద్దగొల్ల నారాయణ.**
**జహీరాబాద్. తెలంగాణ.**

## ఓ అంబేద్కర్ నీవు మళ్ళీ పుడితే!!

ఓ సమాజ బంధు !
అంబేద్కర్ ! నీకు జోహార్!!
సామాజిక చైతన్యం,బౌద్ధిక వ్యవహారం
రాజకీయ ఉద్యమం కలబోసిన
రాజ్యాంగ శిల్పి!
దళితులపై అస్పృశ్యత,
కుల వివక్ష రూపు మాపి,
రాజకీయ నేత అయినప్పటికీ
సంఘ సంస్కర్తవైనావు.
నాడు దళితుల హక్కుల కోసం
బిగించావు ఉక్కు పిడికిలి,
నేడు నీవు ఉంటే తెలిసేది
అగ్రవర్ణాల పై ఘోర కలి.
అనుసూచిత జాతి వాడు ఎవ్వడు?
ఆర్థికంగా కృంగిపోయిన
అగ్రకులజుడా?
దళిత ముద్రతో సకల సౌఖ్యాలు
అనుభవిస్తున్న వాడా ?
రాజ్యాంగం లోని దళితుల అధికారాల
పాతికేళ్ల పరిమితిని కాలరాచి,
స్థితిగతులను తారుమారు
సమాధి చేసిన,
ఈ అసమానతలకు కారకులెవ్వరు?
రిజర్వేషన్ చట్టానికి
ముప్పాతికేళ్ళు అవుతున్నా,
ఓటు బ్యాంకు కై వీరిని అడ్డుపెట్టుకున్న
రాజకీయ నేతలా ?
స్వార్థ ప్రయోజనాల జనులా ?
పార్టీల కతీతంగా న్యాయం
చేసేవారెవ్వరు ?
సమసమాజ స్థాపన చేసేదెవ్వరు ?
ఓ అంబేద్కర్ ,నీవు మళ్ళీ పుట్టాలి !
పుడితే, ఏ వర్గం లో పుట్టాలి?!
(సామాజిక స్పృహతో యోచించి,
చరిత్ర తిరగవ్రాసే ఎవ్వరికైనా ఈ
కవిత అంకితం.)

**-వాసాఉమాజ్యోతిరెడ్డి,అధ్యాపకులు**
**మహిళా కళాశాల, రాజమహేంద్రవరం**

## సుప్రీం పీఠంపై ఆంధ్రుడు

**భారత 48వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్వీ రమణతో ప్రమాణం చేయించిన రాష్ట్రపతి కోవింద్**




**ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఉపరాష్ట్రపతి, ప్రధాని**

## తెలుగుజాతికే గర్వకారణం

అత్యున్నత పదవిలో తెలుగువాడు
తెలుగు వారికి దక్కిన అరుదైన గౌరవం...
రెండవ తెలుగు వాడు కావడం ప్రత్యేక విశేషం!
మొదటి తెలుగు వాడు కోకా సుబ్బారావు
రెండవ తెలుగు వాడు ఎన్. వెంకట రమణ
నదీ పరివాహక ప్రాంతమైన కృష్ణాలో జననం
ఆంధ్రానడిబొడ్డు గుంటూరు నందు చదవడం
జంట జిల్లాలలో ఒంటిగా ఎదిగిన వైనం
ఎందరెందరికో వారు నేటికీ ఆదర్శప్రాయం!
నూతలపాటి వంశమున రైతుబిడ్డడు
న్యాయ స్థానమునందు న్యాయ సింహుడు
ఓ మంచి రైతు బిడ్డగా జనియించిన
న్యాయ సేద్యం చేయడం గొప్ప విషయం
తల్లిదండ్రుల నుండి కష్టించే స్వభావం
గురువుల నుండి పొందిన విజ్ఞానం
సోదరీమణుల నుండి ప్రేమానురాగం
భార్య నుండి పొందిన బాధ్యతాయుతం
ఎన్వీ. రమణ గారికి పెట్టని ఆభరణాలు
తెలుగువారందరికీ ఆదర్శప్రాయాలు
తెలుగు సాహిత్యమంటే ఇష్టం,
రావిశాస్త్రి గారి నవలలు ఇంకా ఇష్టం!
"తెలుగులో న్యాయ పాలన" మరీ ఇష్టం!
తెలుగువాడై నందుకు అందరికీ ఇష్టం!!
తెలుగు వారందరికీ అద్భుతమైన గౌరవం
తెలుగు వారిగా మనకెంతో ఆనందం!

**- జామి సత్యనారాయణ, ఉపాధ్యాయులు.**

## 15 వసంతాల నన్నయ విశ్వవిద్యాలయం

సాంస్కృతిక రాజధానిగా విరాజిల్లుతున్న రాజమహేంద్రవరంలో... గోదావరి తీరాన ఆవిర్భవించిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ పదిహేను వసంతాలు పూర్తి చేసుకుంది. గోదావరి జిల్లా వాసుల చిరకాల వాంఛగా.. దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనుని కృషి, సాధన సమితి సభ్యుల ప్రయత్నాల ఫలితంగా.. మహానేత వైయస్ఆర్ సహకారంతో..రాజరాజనరేంద్రుని రాజధానిలో..నన్నయ నడయాడిన నేలపై ఏర్పడినయూనివర్సిటీ... విద్యార్థులు, అధ్యాపకుల సమష్టి కృషితో... దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతూ .. స్వశక్తితో ప్రగతిని సాధిస్తూ.. విద్య పరంగానే కాకుండా సేవా రంగాన కూడా .. ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకుంటుంది.

తొలి మహిళా ఉపకులపతి నిరూపరాణి, మలి ఉపకులపతి జార్జి విక్టర్ ఏలుబడిలో... భూసేకరణ చేసుకుంది. ఆపై వచ్చిన ఉపకులపతులు ముత్యాలనాయుడు సారథ్యంలో.. యూనివర్సిటి ఒక రూపాన్ని సంతరించుకుని, '12 బి' సాధించగా...

జగన్నాథరావు ఎలుబడిలో జగతి మెచ్చేలా.. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ .. విద్యాబోధనలకు ఆటంకం లేకుండా .. నెట్వర్క్ సాయంతో ఆన్లైన్ క్లాసులు నిర్వహిస్తూ.. వెబినార్లు జరుపుతూ.. 'ఐఎస్ఓ' గుర్తింపును సైతం సాధించి ... 'నాక్' గుర్తింపు పొందే దిశగా అడుగులు వేస్తున్నారు. ఒకప్పుడు చిట్టడవిని పోలిన ఈ నేల,నేడు చదువులతల్లి ఒడిగామారి,విద్యాకుసుమాలు విరబోస్తూ.. తెలుగు రాష్ట్రాలలోనే పెద్ద యూనివర్సిటీగా .. విరాజిల్లుతుందంటే అందుకు కారకులు ... ఎందరో మహానుభావులు.... అందరికీ అభినందన చందనాలు!!

**-మాచర వెంకటరమణ గంధం, రాజానగరం.**

## ఏకలవ్య ప్రోగ్రామ్ ను ప్రారంభించిన వీసీ

**16.04.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ఏకలవ్య కార్యక్రమాన్ని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలోని శుక్రవారం దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. ఉభయగోదావరి జిల్లాల్లోని గ్రామీణ నేపథ్యంనుండి వచ్చిన విద్యార్థులు విశ్వవిద్యాలయంలో ఎక్కువ మంది ఉన్నారని వారికి స్పోకెన్ ఇంగ్లీషు స్కిల్స్, కంప్యూటర్ స్కిల్స్ అభివృద్ధి చేసేందుకు "ఏకలవ్య ప్రోగ్రామ్" ను ప్రారంభించామని అన్నారు. ఈ ప్రోగ్రామ్ లో ఇంగ్లీషు, కంప్యూటర్ వంటి స్కిల్స్ పై విద్యార్థులకు మూడు వారాలు శిక్షణను అందిస్తారని తెలిపారు. శిక్షణ తరువాత విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సర్టిఫికెట్లను అందిస్తారన్నారు. ఏకలవ్యుడు లక్ష్య సాధనకు ఏ విధంగా కృషి చేసాడో అదే క్రమంలో విద్యార్థులు కృషి చేయాలని, ఆత్మస్థైర్యాన్ని నింపుకోవాలని అన్నారు. విద్యార్థులలోని నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు.



ఏకలవ్య బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ

ఏకలవ్య ప్రోగ్రామ్ కు కన్వీనర్ గా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, కోఆర్డినేటర్లుగా విభాగాధ్యాపకులు బి.బి.అహ్మద్ అలీబాబా, డి.దాసు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఏకలవ్య ప్రోగ్రామ్ కు సంబంధించిన పాఠ్యాంశాలను రూపొందించారని ఆసక్తి ఉన్న విద్యార్థులు నిర్వాహకులను సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీసీ సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్స్ డా.కె.రమణేశ్వరి, డా.కె.సుబ్బారావు, డా.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




**ఎస్.కె.ఆర్ కళాశాలలో 23వ తేదిన ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే మరియు షేక్స్పియర్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు సాహిత్య పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.**

# కోవిడ్ అవగాహన నన్నయ పాత్ర

## కోవిడ్ అవగాహనపై వీసీలతో గవర్నర్ సమీక్ష




**20.04.21 (మీడియాసెల్)** కోవిడ్ విజృంభిస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు తీసుకున్న జాగ్రత్తలు అవగాహన కార్యక్రమాలపై మంగళవారం గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ వీడియో కన్ఫరెన్స్ ను నిర్వహించారు. కోవిడ్ పై సమాజానికి అవగాహన కల్పించడంలో విశ్వవిద్యాలయ పాత్ర అనే అంశంపై గవర్నర్ సమీక నిర్వహించారు. అన్ని విశ్వవిద్యాలయ వీసీలు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరైన ఈ సమావేశంలో నన్నయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై కోవిడ్ నేపథ్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తీసుకున్న జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాలను తెలియజేశారు. ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో కోవిడ్ అవగాహన సదస్సులు, నిత్యావసర వస్తువుల పంపిణి తదితర కార్యక్రమాలను వివరించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణాలలో హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేయించడం, అన్ని విభాగాలకు శానిటైజర్లు అందించడం, మాస్కులు ధరించి భౌతిక దూరం పాటిస్తూ విధులు నిర్వహించడం వంటి అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి గృహాలను ఖాళీ చేయించి ఇండ్లకు పంపించి ఆన్ లైన్ తరగతులును నిర్వహిస్తున్నామని తెలిపారు. విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అన్ని పాఠ్యాంశాలను "లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్" పేరుతో ఈ-కంటెంట్ రూపంలో ఆన్ లైన్ లో పొందుపరిచామన్నారు. కోవిడ్ కాలంలో విశ్వవిద్యాలయం నిర్వహించిన విద్య, విజ్ఞాన, పరిశోధన అంశాలను వెబినార్లు, స్వచ్ఛతాయాక్షన్ ప్లాన్ తదితర అంశాలను వీసీ వివరించారు.




## కోవిడ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్

మార్చి 2020 నుండి కోవిడ్ ప్రసారం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించడంలో ఎన్ఎస్ఎస్ సెల్ చురుకుగా ఉంది. విశ్వవిద్యాలయ ఫ్రంట్‌లైన్ ఉద్యోగుల కోసం మాస్క్ లు, శానిటైజర్లు మరియు రక్షణ గేర్‌లను ఎన్ఎస్ఎస్ సెల్ పంపిణీ చేసింది. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు క్రమం తప్పకుండా కోవిడ్ పై అవగాహన డ్రైవ్‌లలో పాల్గొన్నారు. రెగ్యులర్ మాస్క్ ధరించడం, చేతి శు భ్రపరచడం మరియు సామాజికదూరం వంటి అన్ని జాగ్రత్తలు తమ సంస్థ ప్రాంగణంలో పాటించేలా చూశారు.

రాష్ట్రంలో మహమ్మారిని గుర్తించినప్పటి నుండి కోవిడ్ ప్రవర్తన మరియు అవగాహనకు సంబంధించిన ప్రచారం నిర్వహించడానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం యొక్క ఎన్ఎస్ఎస్ యూనిట్ ముందంజలో ఉంది.




1.ప్రధాన క్యాంపస్‌లు మరియు అనుబంధ కళాశాలల నుండి ఎన్ఎస్ఎస్ యూనిట్ల స్వచ్ఛంద సేవకులందరికీ అవగాహన కల్పించడం ఈ ప్రచారంలో చాలా ముఖ్యమైన అంశం. అవగాహన కల్పించిన ఈ విద్యార్థులు సంఘం, గ్రామం, కుటుంబం తదితర ప్రజలందరికీ మరింత అవగాహన కల్పించాలని అభ్యర్థించారు. ఈ విధంగా కోవిడ్ ప్రచార వాలంటీర్ల నెట్‌వర్క్ కోవిడ్ ప్రచారంలో చురుకుగా పాల్గొంటుంది. ప్రచారానికి ఇది చాలా ముఖ్యమైన మరియు వినూత్న పద్ధతి.


2.రోగుల సందేహాలను స్పష్టం చేయడానికి, బాధిత కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇవ్వడం, ప్రజల భయాలు, వైద్య సమాచారం మరియు కోవిడ్ సంసిద్ధతపై సమాచారం ఇవ్వడానికి ఆన్-లైన్ సైకలాజికల్ కౌన్సెలింగ్ కేంద్రాలను ప్రారంభించిన మొదటి విశ్వవిద్యాలయాలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఒకటి. తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాల నుండి ప్రజలు దీనిని ఉపయోగించారు.



## కోవిడ్ అవేర్‌నెస్ 70 వెబినార్లు

సమర్థవంతమైన అధికారులు విద్యార్థులకు కోవిడ్ ప్రసారం చేసే ప్రమాదాలపై అవగాహన కల్పించడంలో ఎన్ఎస్ఎస్ సెల్ చురుకుగా ఉంది. లాక్డౌన్ సమయాల విజయ కథలు మరియు కోవిడ్ ప్రసారం కోసం ఉమ్మివేయడం యొక్క ప్రమాదాలపై 70 వెబినార్ల ద్వారా అవగాహన కల్పించింది. అన్‌లాక్ ప్రక్రియలో, విశ్వవిద్యాలయంలోని హాస్టలర్లు మరియు బోధనేతర ఉద్యోగులకు కోవిడ్ ట్రాన్స్మిషన్ పద్ధతులపై ఎన్ఎస్ఎస్ సెల్ అవగాహన కల్పించింది. విద్యా సంస్థల కోసం స్వచ్ఛ కార్యాచరణ ప్రణాళికను అనుసరించింది.

## హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారి



**24.04.21 (మీడియాసెల్)** కోవిడ్ 19 సెకండ్ వేవ్ విజృంభన నేపథ్యంలో కోవిడ్ కట్టడికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అన్ని రకాల జాగ్రత్తలు వహిస్తుంది. శనివారం విశ్వవిద్యాలయం క్యాంపస్ మొత్తం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేయిస్తున్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ కోవిడ్ 19 విజృంభిస్తున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. శనివారం వర్క్ ఫ్రమ్ హోమ్ గా ప్రకటించి శని,ఆదివారాలు విశ్వవిద్యాలయ ప్రాంగణమంతా హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేయిస్తున్నామని చెప్పారు. ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ కళాశాలల తరగతి గదుల్లోను, స్టాఫ్ రూమ్ లలోను, హాస్టల్స్ లోను మరియు కేంద్ర పరిపాలన భవనంలోని అన్ని విభాగాలలో పూర్తిగా శానిటైజ్ చేస్తున్నామన్నారు. అలాగే ఉభయగోదావరి జిల్లాల్లోని అధ్యాపకులు, విద్యార్థులు కోవిడ్ పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని స్వీయ నియంత్రణ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. దగ్గు, రొంప, జ్వరం, గొంతునొప్పి, రుచి వాసన తెలియకపోవడం వంటి కోవిడ్ లక్షణాలు ఉన్నవారు వెంటనే హాస్పటల్ కు వెళ్ళి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. మన ఆరోగ్యం కంటే ఏది ముఖ్యం కాదని, వ్యక్తిగతంగా ఎవరికి వారు ఆరోగ్యాన్ని పరీక్షించుకుంటూ సమాజక్షేమం కోసం బాధ్యతగా ఉండాలని తెలియజేశారు.